సాక్షి గుంటూరు

బుధవారం । 6 । ఆగస్టు । 2025



కుంకుమ పూజలు

భట్టిప్రోలు: భట్టిప్రోలులోని పరంజ్యోతి అమ్మ భగవాన్ మందిరంలో మంగళవారం శ్రీ లక్ష్మీ అమ్మవారికి భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులు పాల్గొన్నారు.



వెల్లటూరులో సంకీర్తనలు

వెల్లటూరు(భట్టిప్రోలు): వెల్లటూరులోని గీతా మందిరంలో మంగళవారం ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు భజన సంకీర్తనలు నిర్వహించారు.



రేషన్ బియ్యం స్వాధీనం

తాడికొండ: రాయపూడి గ్రామంలో 23 బస్తాల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం రాత్రి స్థానిక శివాలయం సమీపంలో వీటిని పట్టుకున్నారు.

న్యూస్‌రీల్

13 నుంచి అమరేశ్వరుని పవిత్రోత్సవాలు



అమరావతి: ప్రసిద్ధ శైవ క్షేత్రం అమరావతి అమరేశ్వరాలయంలో 13వ తేదీ బుధవారం నుంచి పవిత్రోత్సవాలను శాస్త్రోక్తంగా ప్రారంభిస్తామని ఆలయ ఈఓ రేఖ మంగళవారం తెలిపారు. యార్లగడ్డ ఉపేంద్ర, విజయలక్ష్మి దంపతుల నేతృత్వంలో మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నామన్నారు. మొదటి రోజు వేదపండితులచే ఉదక శాంతి, ఆలయ శుద్ధి, ప్రధాన ఉపాలయాల మూర్తులకు స్నపనాభిషేకాలు, అర్చనలు నిర్వహిస్తారన్నారు. రెండోరోజు గురువారం మండప పూజలు, దీక్షా హోమాలు, మూలమంత్ర హవనములు, రుద్రహోమం, పవిత్రారోపణం , చండీహోమం మూడవరోజు శుక్రవారం ప్రాయశ్చిత్త హోమం, పూర్ణాహూతి, మహదాశీర్వచనం కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన



మంగళగిరి/ మంగళగిరి టౌన్: ఈ నెల 7వ తేదీన జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ఆటోనగర్‌లో ఉన్న వీవర్స్‌శాలను ముఖ్యమంత్రి చంద్రబాబు సందర్శించనున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ,ఎమ్మెల్సీ పెందుర్తి వెంకటేశ్వరరావు, సబ్ కలెక్టర్ ఎ. భార్గవ్ తేజ, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహ, సీఎం కార్యక్రమాల కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేశ్వరరావు, ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషా, మంగళగిరి తహసీల్దార్ దినేష్‌రాఘవేంద్రలు ఏర్పాట్లను పరిశీలించారు. సీఎం ప్రయాణించే మార్గాలు, వాహనాల పార్కింగ్, వీవర్ శాల సందర్శన, చేనేత కుటుంబాలతో సమావేశమయ్యే ప్రజావేదిక వద్ద అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు.

ఐపీఎస్‌కు ఎంపికైన దోనేపూడి విజయ్‌బాబు

- ప్రస్తుతం ఐఆర్ఎస్ అధికారిగా విధుల నిర్వహణ



తెనాలి: పట్టణానికి చెందిన దోనేపూడి విజయ్‌బాబు ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. 2024 సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో ర్యాంకులు సాధించిన అభ్యర్థులకు సర్వీస్‌లను కేటాయిస్తూ యూపీఎస్‌ఈ మంగళవారం తుది ఫలితాలను విడుదల చేసింది. 2021 సివిల్స్ పరీక్షల్లో తొలి ప్రయత్నంలోనే ఐఆర్ఎస్‌కు ఎంపికైన విజయ్‌బాబు, ప్రస్తుతం విజయవాడలో ఆదాయపు పన్ను శాఖలో అసిస్టెంట్ కమిషనర్ (ఇన్వెస్టిగేషన్స్) బాధ్యతల్లో ఉన్నారు. ఐఏఎస్‌కు ఎంపిక కావాలన్న లక్ష్యం కోసం వరుసగా సివిల్స్ పరీక్షలు రాస్తూ వచ్చారు. నాలుగో పర్యాయం 681 ర్యాంకు సాధించి ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. అయినప్పటికీ తనకు సంతృప్తి లేదన్నారు. విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి అయిన తన తండ్రి దోనేపూడి మధుబాబు కోరిక ప్రకారం ఐఏఎస్ అధికారి కావాలన్నదే తన కలగా విజయ్‌బాబు చెప్పారు. అందుకోసం మరోసారి సివిల్స్ రాస్తానని తెలిపారు.

తెనాలిలో ఎస్పీ తనిఖీలు



తెనాలి రూరల్: పట్టణంలో గంజాయి వినియోగానికి కేంద్రాలుగా మారిన పలు ప్రాంతాలను జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. సిబ్బంది నుంచి వివరాలు సేకరించారు. పట్టణంలో కూడా పర్యటించారు. శిథిల భవనాలు, నిర్మాణ దశలో ఆగిపోయిన భవనాలు గంజాయి వినియోగానికి అడ్డాలుగా మారాయని చెప్పారు. మరో ఎనిమిది చోట్ల నిఘా ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఆయన వెంట డీఎస్పీ బి.జనార్ధనరావు, సీఐలు వి. మల్లికార్జునరావు, రాముల నాయక్, ఎస్. రమేష్‌బాబు, ఆర్. ఉమేష్, సిబ్బంది ఉన్నారు.

బతుకు బస్టాండే

వసతులు లేక ప్రయాణికుల కష్టాలు

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

- మరుగుదొడ్లు అధ్వానం
- తాగడానికి గుక్కెడు నీరూ కరువే..
- సమాచార కేంద్రాల మూసివేత
- గోడు పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- తీవ్ర ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు



నేమ్ బోర్డుకు కూడా దిక్కు లేని గుంటూరు ఆర్‌టీసీ బస్టాండు

పట్నంబజారు: ఆర్టీసీ బస్సుల్లో నిత్యం లక్షలాది మంది ప్రయాణాలు చేస్తుంటారు. కానీ వారి సమస్యలు అటు పాలకులకు, ఇటు అధికారులకు ఏ మాత్రం పట్టడం లేదు. దుర్వాసన తప్పని టాయిలెట్లు, కనీస వివరాలివ్వని సమాచార కేంద్రాలు, జేబులకు చిల్లు పెడుతున్న వ్యాపారులు, మందుబాబుల ఆగడాలు, గంజాయి తాగొచ్చే బ్యాచ్‌ల అల్లర్లు, అర్ధరాత్రి అసాంఘిక కార్యకలాపాలకు ఆర్టీసీ బస్టాండ్‌లు కేంద్రాలు మారుతున్నాయి. అధికారంలోకి వచ్చాక ఏడాదిలో ఆర్టీసీ రూపురేఖలు మారుస్తామని కూటమి పెద్దలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ నేటికీ నెరవేరడం లేదు. ఆర్టీసీ ఉన్నతాధికారులు చెప్పిన మాటలు నీటిపై రాతలుగా మారాయి. గుంటూరు జిల్లా కేంద్రంలోని ప్రధానమైన ఎన్టీఆర్ బస్టాండ్‌కు కనీసం బోర్డు కూడా కనపడని పరిస్థితుల్లో ఉంది.

ఇవిగో సమస్యలు

- విజయవాడ బస్సులు రాకపోకలు సాగించే బస్టాండ్‌లో పరిశీలిస్తే ఒక్క కుర్చీ కూడా లేదు. నిత్యం గుంటూరు - విజయవాడ మధ్య సుమారు 80 నుంచి వంద వరకు బస్సులు తిరుగుతుంటాయి. కానీ ప్రయాణికులు కూర్చోలేని దుస్థితి.
- ప్రాంగణంలో కుక్కలు తిరుగుతున్నాయి.
- యాచకులు ఎక్కువ మంది అక్కడే ఉన్నారు.
- మందుబాబులు, గంజాయి బ్యాచ్, బ్లేడ్ బ్యాచ్‌తో ప్రయాణికులు బెంబేలెత్తుతున్నారు. ఆర్టీసీ సెక్యూరిటీ, అవుట్ పోస్ట్ పోలీసులు మచ్చుకైనా లేరు.
- సమాచారం కేంద్రం సామగ్రితో నిండిపోయింది. ఆర్టీసీ సిబ్బంది ఒక్కరూ లేరు.
- ఉచిత జలం అని చెప్పిన చోట కుళాయి అలంకార ప్రాయంగా మారింది. పూర్తిగా తుప్పుబట్టి ఎక్కడిక్కడ రేకులు విరిగిపోతున్న పరిస్థితులు.
- టాయిలెట్స్ దుర్వాసన భరించలేని స్థితి. పరిశుభ్రత మచ్చుకైనా లేదు.
- ప్రైవేట్ సంస్థల నిర్వహణలో ఉన్న చోట ఎక్కువ నగదు వసూలు చేస్తున్నారు. తగిన సదుపాయాలు కల్పించటం లేదు. ఫ్లోరింగ్ కూడా పూర్తిస్థాయిలో పగిలిపోయి ఉంది. ప్రయాణీకులు గాయాలపాలైన సంఘటనలు చాలా ఉన్నాయి.



మూతపడిన విచారణ కేంద్రం



పనిచేయని తాగునీటి ఫ్రిజ్

ప్రధాన ప్రాంగణంలోకి వెళితే..

ఇక్కడ బస్టాండ్ ఆవరణం ఫ్లోరింగ్ మొత్తం పగుళ్లు ఏర్పడ్డాయి. బస్సుల కోసం వెళ్లే క్రమంలో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.

- డిపో 1 పరిధిలో ఉన్న పాస్‌ల కౌంటర్‌లో సిబ్బంది లేకుండా పోయారు. పాసులు తీసుకునేందుకు వచ్చిన విద్యార్థులు, ఉద్యోగులు వెనుతిరగాల్సిన దుస్థితి.
- టీ స్టాల్ నిర్వాహకులు పరిశుభ్రత పాటించడం లేదు. తాగేసిన గ్లాసులు, వాడేసిన నీరు అక్కడే ప్రవహిస్తోంది. ఆ ప్రాంతమంతా దుర్గంధంగా వస్తోంది.
- డిపో 1 పరిధిలోనే గతంలో మహిళా కండక్టర్లకు విశ్రాంత గది ఉండేది. ఇప్పుడు ఆ సౌకర్యం లేదు. ఈ గదిలో పనికి రాని సామగ్రి, చెత్తాచెదారం ఉన్నాయి.
- ఆర్టీసీ ఆస్పత్రిలో సరైన వైద్య సేవలు అందటం లేదని గతంలోనే అనేక ఫిర్యాదులు అందాయి. వైద్యులు, వైద్య సిబ్బంది సమయపాలన పాటించనట్లు తేటతెల్లమైంది.



తాగునీటి కొళాయి వద్ద దుస్థితి..

గుంటూరు డిపో- 2 పరిధిలో..

- గుంటూరు డిపో- 2 ఒక మహా సముద్రమే. గుంటూరు రీజియన్ పరిధిలో ఆర్టీసీకి ఆదాయం తెచ్చిపెట్టే డిపోల్లో ఇదీ ఒకటి. అయినప్పటికీ ఇక్కడ సమస్యల తిష్ట వేసి ఉన్నాయి. ఎక్కువగా విరిగిపోయిన కుర్చీలు దర్శనమిస్తున్నాయి.
- ఎండల నేపథ్యంలో కనీసం కూలర్లు కూడా పనిచేయని పరిస్థితి.
- అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ (ఏటీఎం) రూంలో సైతం సిబ్బంది లేరు.
- సీసీ కెమెరాలు అన్నీ పనిచేయడం లేదు. అవుట్‌పోస్ట్‌లో సిబ్బంది లేని పరిస్థితులు. కేవలం వచ్చి సంతకాలు పెట్టి వెళ్లిపోతున్నారు.
- డిపోలలో మరుగుదొడ్లు భరించలేని దుర్వాసన వస్తున్నాయి.
- వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి.
- పలు చోరీలు జరగుతున్న నేపథ్యంలో పోలీసులు పట్టించుకోవడం లేదు.

గుంటూరు రీజయన్ పరిధిలో మొత్తం 412 బస్సులు ఉండగా, అందులో 97 హైర్, 215 పల్లె వెలుగు, 41 అల్ట్రా డీలక్స్, 44 సూపర్ లగ్జరీ, 12 ఇంద్ర, అమరావతి స్కానియా 4 ఉన్నాయి. నిత్యం లక్ష మందికిపైగా ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. రూ. 70 లక్షల వరకు ఉంటుందని గణాంకాలు చెబుతున్నాయి.



కూర్చొనే వసతులు లేని పల్నాడు బస్టాండ్



గుంటూరు బస్టాండ్‌లో విరిగిన కుర్చీ



అధ్వానంగా మరుగుదొడ్లు పరిసరాలు

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం



ఆర్టీసీ బస్టాండ్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తాం. ప్రస్తుతం నేను ఇన్‌చార్జి ఆర్ఎంగా వ్యవహరిస్తున్నాను. సమస్యలు ఏమైనా ఉంటే.. సంబంధిత అధికారులకు చెప్పి పరిష్కరిస్తాం. దీంతోపాటుగా ఉన్నతాధికారుల దృష్టికీ తీసుకుని వెళ్తాం.

– డి. స్వామ్రాజ్యం, ఇన్‌చార్జి ఆర్ఎం, గుంటూరు

స్టేడియం ఎన్నికల్లో టీడీపీ పాట్లు

- పశ్చిమ ఏరియాలో ఎమ్మెల్సీ రాజా పెత్తనం
- మండిపడుతున్న ఎమ్మెల్యే మాధవి వర్గం
- ఎన్టీఆర్ స్టేడియం పాలక వర్గ ఎన్నికలతో విభేదాలు
- ఎమ్మెల్యేకి వ్యతిరేకంగా బరిలో ఎమ్మెల్సీ ప్యానల్
- బలవంతంగా విత్‌డ్రా చేయించిన ఆలపాటి రాజా
- ఎమ్మెల్యే వర్గానికి తప్పని మొండిచెయ్యి
- ఏమాత్రం ఫలించని రాజీ ప్రయత్నాలు
- మున్సిపల్ అధికారులు దాసోహం



సాక్షి ప్రతినిధి, గుంటూరు: తమ నియోజకవర్గంలో ఎమ్మెల్సీ రాజేంద్ర ప్రసాద్‌కు ఏం పని.. ఎన్టీఆర్ మున్సిపల్ క్రీడా ప్రాంగణం, స్విమ్మింగ్ పూల్ సొసైటీ పాలకవర్గ ఎన్నికలకు అభ్యర్థుల ఎంపికలో ఆయన జోక్యం ఏంటి? ఎమ్మెల్యేకి కనీస ప్రాధాన్యత ఇవ్వరా?... అని పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి వర్గం మండిపడుతోంది. స్టేడియం పాలక వర్గం ఎన్నికల్లో తన సొంత ప్యానెల్‌ను పెట్టడంతోపాటు ఏకగ్రీవం పేరుతో ఎమ్మెల్యే మద్దతుతో బరిలోకి దిగిన వారిని కూడా బలవంతంగా విత్‌డ్రా చేయించడం వివాదాస్పదంగా మారింది.

నేతలకు ఊడిగం చేస్తేనే పదవి ఇస్తారా?

కార్యదర్శి పదవికి పోటీ చేస్తున్న దొడ్డపనేని రాజేంద్ర పార్టీలో కూలీగా ఉన్నానంటూ సోషల్ మీడియాలో పెట్టిన పోస్టు వైరల్‌గా మారింది. పార్టీకి కష్టపడిన వారికి కాకుండా నాయకులకు ఊడిగం చేసేవారికే పెద్దపీట వేస్తున్నారంటూ ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 'టీడీపీలో నిక్కరు వేసుకున్నప్పటి నుంచి అభిమానిని. జెండా మోసే కార్యకర్తను. అది కూడా అంకితభావంతో ఇప్పటి వరకు వచ్చిన ప్రతి నాయకుడికి ఊడిగం చేశా. సుదీర్ఘ పార్టీ ప్రయాణంలో ఏ అవకాశంలోనూ పార్టీ పెద్దలు నన్ను ఒక కార్యకర్తగా చూశారే కానీ.. ఏ విధమైన పదవి ఇవ్వలేదు. బాబు అంటే పిచ్చి అభిమానం. అందుకే రాజీ పడి పార్టీ పట్ల అంకితభావంతో పనిచేసుకుపోతున్నా. కొందరు స్వార్థపరుల మూలంగా ఉన్న పదవి తీసేసి చాలా కాలం అయ్యింది. ఐనా నా తెలుగు దేశం, నా కర్తవ్యం అనే పనిచేశా. ఇప్పుడు స్టేడియం సెక్రెటరీ అని ఒక చిన్న పదవి అడిగా. రాబోయేది స్థానిక సంస్థల ఎన్నికల సంవత్సరం. చిన్నదో.. పెద్దదో ఈ పదవిలో ఇమిడిపోతే కొన్ని డివిజన్లు ప్రెస్టేజ్‌గా తీసుకొని పూర్తి టైం కేటాయించి పని చేద్దాం అని. కానీ అర్థం చేసుకొనే నాయకుడు ఒక్కడూ లేడు. ఇన్ని సంవత్సరాల తరువాత నాకు అర్థమయ్యింది ఒక్కటే. నాలుగు ఓట్ల కోసం జనం చుట్టూ కాదు... అవకాశాల కోసం నాయకుల చుట్టూ తిరుగు. ఇది అర్థం అవ్వటానికి ఇన్నేళ్లు పట్టింది. ఇక నాలాంటి వాడు ఎలా బాగుపడతాడు. అందుకే ఈ తెలుగు దేశం పార్టీలో నేనొక 'అనాథని'. నాలాంటి డబ్బులేనోడికి ఈ పార్టీలో పదవి రావడం కష్టం.''... అని సోషల్ మీడియాలో సర్క్యులేట్ అవుతున్న గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి చెందిన దొడ్డపనేని రాజేంద్ర అనే సీనియర్ కార్యకర్త ఆవేదన వ్యక్తం చేశారు. 20 ఏళ్లపాటు డివిజన్ అధ్యక్షుడిగా పార్టీకి సేవలు అందించిన తాను స్టేడియం కార్యదర్శి పదవికి నామినేషన్ వేస్తే వేరే వారి కోసం తనను విత్‌డ్రా చేసుకోమని ఒత్తిడి తెస్తున్నారని ఆయన ఆరోపిస్తున్నారు. అయితే ఆయన విత్‌డ్రా చేసుకోకుండా, బరిలోకి దిగారు.

రాత్రి వరకు ఉపసంహరణలు

వాస్తవానికి నామినేషన్ల ఉపసంహరణ గడువు మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు ముగిసింది. కానీ రాత్రి 8.30 గంటల వరకూ ఉపసంహరణలు కొనసాగాయి. అధికారుల వ్యవహార శైలిపై కూడా విమర్శలు వచ్చాయి. మొత్తం 59 మంది బరిలోకి దిగగా.. అందులో 15 మంది మాత్రం మిగిలారు. వైస్ ప్రెసిడెంట్‌గా దామ మహేశ్వర రావు, జాయింట్ సెక్రటరీగా జనసేన నుంచి పాకనాటి ఉమామహేశ్వర రావు ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు. అదేవిధంగా ఎగ్జిక్యూటివ్ బాడీ మెంబర్స్‌లో మహిళలలో లగడపాటి అంజలి, గుంటుపల్లి యామిని శివజ్యోతిలు ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు. కోశాధికారి పదవికి కందే కాంతారావు, బండ్లమూడి సుబ్బయ్యలు, సెక్రటరీ పదవికి వజ్జా రామకృష్ణ, దొడ్డపనేని రాజేంద్ర కుమార్‌లు పోటీ పడుతున్నారు. ఎగ్జిక్యూటివ్ బాడీ మెంబర్స్ పురుషులకు సంబంధించి 11 మంది పోటీ పడుతున్నారు. ఈ నెల 18న ఎన్నికలు జరగనున్నాయి.

దుర్మార్గాల ధూళిపాళ్ల

- నరేంద్ర జీవితం మొత్తం బెదిరింపులు, వసూళ్లు, అక్రమాలే
- బ్రోకర్‌లను పెట్టి మరీ బిల్డర్లను బెదిరిస్తున్న ఎమ్మెల్యే
- ఆఖరికి సొంత పార్టీ నేతలనూ సొమ్ము కోసం వదలని కక్కుర్తి
- వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ధ్వజం



మాట్లాడుతున్న అంబటి మురళీకృష్ణ

పట్నంబజారు: 'నువ్వొక బోగస్ గాడివి.. నీ జీవితం అంతా అవినీతిమయం.. గుంటూరుకు మకాం మార్చి బ్రోకర్‌గాళ్లను అడ్డుపెట్టుకుని బిల్డర్‌లను భయపెట్టిస్తున్నావ్. మహానగరంలో మాయగాడిలా వ్యవహరిస్తున్నావ్. ఆఖరికి టీడీపీ చెందిన ఒక మహిళా ఎమ్మెల్యే భర్తనే భయపెట్టే స్థాయికి దిగజారావు..' అంటూ పొన్నూరు నియోజకవర్గ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి అధికారంలోకి వచ్చిన ఏడాదిలో నరేంద్ర భారీగా అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. గుంటూరులోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం అంబటి మురళీకృష్ణ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2104-19 టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు అవినీతికి కేంద్ర బిందువుగా పల్నాడు జిల్లాలో ఒక టీడీపీ నేత వ్యవహరిస్తే ఏ గతి పట్టిందో చూశామని, 2024-29 మధ్య నరేంద్ర కూడా ఇదే విధంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. చేబ్రోలు నుంచి మంచాల వెళ్లే రోడ్డులో రూ.45 కోట్లతో వైఎస్సార్‌సీపీ హయాంలో మంజూరైన బ్రిడ్జి నిర్మాణం ఇంత వరకు ముందుకు సాగలేదని, కాంట్రాక్టర్‌ను రూ. 5 కోట్లు కప్పం అడిగినట్లు తెలుస్తోందన్నారు.

'సంగం' అభివృద్ధిలోనూ ఫెయిల్

సంగం చైర్మన్‌గా ఉన్న నరేంద్ర సంస్థను అభివృద్ధి చేశారని అందరూ భ్రమపడుతున్నారని తెలిపారు. ములుకుదురు, చింతలపూడిలో ఆయనదో బడ్డీ కొట్టు అని విమర్శించారు. ధూళిపాళ్ల తండ్రి సంగం సంస్థను అభివృద్ధి చేశాడా..? ఆయన తాత పొలాలు కొన్నాడా..? అని ప్రశ్నించారు. కో ఆపరేటివ్ సొసైటీ భూమి కబ్జా చేశారని ధ్వజమెత్తారు. కుటుంబ వారసుడిని తాననే నరేంద్ర చెబుతున్నారని, రవికుమార్ గురించి ఎందుకు మాట్లాడరని ప్రశ్నించారు. ధూళిపాళ్ల రాజకీయ భవిష్యత్తు కోసం రవికుమార్ చేబ్రోలులో హత్య చేశాడని గుర్తుచేశారు. రవికుమార్ కుమారుడు ఇప్పుడు నానమ్మను ఆస్తి వాటా అడుతున్నాడని తెలిపారు. అయినప్పటికీ వారి కుటుంబ అంశాలు తమకు అనవసరం అన్నారు. టీడీపీలో నరేంద్రకు ప్రాధాన్యం లేదని, సంగం సంస్థను సైతం నరేంద్ర చేతుల్లో నుంచి లాక్కునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోందన్నారు. సంగం సంస్థ పక్కన ఏర్పాటు చేసిన ఆసుపత్రికి సంబంధించి బైలాలో స్పష్టంగా పశువుల ఆసుపత్రి కట్టాలని ఉందని, ఏ నిర్మాణం జరిగిందో అందరికీ తెలుసన్నారు. నరేంద్ర ఆగడాలు ఆపేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే సంగం సంస్థను సర్కారు తీసుకునేందుకు ప్రయత్నాలు జరిగాయన్నారు. ఎన్నికలు రావటంతో ధూళిపాళ్ల బతికిపోయారని తెలిపారు. నగదు చెల్లించలేదని పలువురు రైతులు సంగం వద్ద ఆందోళన చేసిన సందర్భాలు ఉన్నాయని చెప్పారు. మామిడిపల్లి, వడ్లమూడిలో కల్యాణ మండపాలు కట్టేందుకు ఒక ఎన్ఆర్ఐ రూ.4 కోట్లు చందా ఇచ్చారని తెలిపారు. వాస్తవానికి చింతలపూడిలో ధూళిపాళ్ల వీరయ్య చౌదరి పేరుతో పెట్టిన కల్యాణ మండపంలోనే అడ్డగోలుగా డబ్బు వసూలు చేస్తున్నారని చెప్పారు. ఇక్కడా అదే పని చేస్తారని తెలిపారు. గాంధీ అనే వ్యక్తి ధూళిపాళ్ల వేధింపులతోనే ఆత్మహత్యకు పాల్పడ్డారని చెప్పారు.

కుటుంబసభ్యులతోనూ అక్రమాలు చేయించి..

గ్రావెల్ మాఫియాకు సంబంధించి నరేంద్ర సోదరుడు రవికుమార్ ప్రస్తుతం లేనప్పటికీ.. ఎంత దోచుకున్నారో ప్రతి ఒక్కరికీ తెలుసన్నారు. మట్టి అక్రమ తవ్వకాల కోసం ఒక భారీ గోడను కట్టి మరీ దాచిపెడుతున్నారని, చెరువుల్లో నీటిని తోడేస్తున్నారని ధ్వజమెత్తారు. దీని గురించి ప్రశ్నించి ఫిర్యాదు చేశారనే కోపంతో బొనిగల నాగ మల్లేశ్వరరావుపై హత్యాయత్నం చేయించారని ఆరోపించారు. రవికుమార్ అవినీతి, అక్రమాల గురించి మీడియాలో పలు కథనాలు వచ్చాయన్నారు. పల్నాడులోని ఒక నేతకు ఎమ్మెల్యే మామ కానుకగా ఆంజనేయస్వామి భూములను దేవదాయశాఖ అధికారులతో మాట్లాడి ధారాదత్తం చేశారని ఆరోపించారు. అక్కడ ఆసుపత్రి నిర్మించాలని స్థలాన్ని అలాగే ఉంచారన్నారు. చింతలపూడిలో ధూళిపాళ్ల మామ కూడా ముస్లిం శ్మశానవాటికను ఆక్రమించుకున్నారని తెలిపారు. పొన్నూరు కేంద్రంగా రేషన్ మాఫియా దందా నడుస్తోందని, సీజ్ ద షిప్ అని చెప్పిన డిప్యూటీ సీఎం పొన్నూరులో మాఫియాను సీజ్ చేయాలని హితవు పలికారు.

రాజధానిలోనూ దౌర్జన్యాలు

అవినీతికి పాల్పడుతున్న ఎమ్మెల్యే విషయంలో ప్రభుత్వం స్పందించాలన్నారు. రాజధానిలో ధూళిపాళ్ల దౌర్జన్యాలు చేస్తున్న విషయం తెలియదా అని చంద్రబాబును ప్రశ్నించారు. నరేంద్రను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని, క్రిమినల్ కేసులు పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. రైతుల నుండి ఆక్రమించుకున్న భూములను తిరిగి అప్పజెప్పాలని డిమాండ్ చేశారు. బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో తాము పర్యటిస్తుంటే నరేంద్ర బాగోతాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయని తెలిపారు. డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ దీనిపై ఒత్తిడి పెంచాలన్నారు. కాకాని గ్రామంలో నల్లమిల్లి శ్రీనివాసరావు అనే వ్యక్తిని అక్రమ కేసు పెట్టి అరెస్ట్ చేయించారని, ఇవన్నీ డైవర్షన్ పాలిటిక్స్ అని మండిపడ్డారు.

నాపైనా తప్పుడు ఆరోపణలు

నేనేదో అక్రమ కట్టడాలు కడుతున్నానని రైల్వే అధికారులకు ఫిర్యాదు చేశారని గుర్తుచేశారు. అయితే వారు స్పష్టంగా తన ప్రాజెక్టు సక్రమంగానే ఉందని, కార్పొరేషన్ అధికారులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారన్నారు. శలపాడులో నరేంద్ర బినామీలకు మైనింగ్ తవ్వకాలకు అనుమతినిచ్చారని, అంతకు మించి మైనింగ్ జరిగితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు.



ట్రైబల్ ఫొటో అవార్డులకు ఎంపిక

వినుకొండ: అంతర్జాతీయ ఆదివాసి దినోత్సవాల సందర్భంగా క్రియేటివ్ కల్చర్ కమిషనర్, గవర్నమెంట్ ఆఫ్ ఏపీ, ఇంటర్నేషనల్ ఫొటోగ్రాఫిక్ కౌన్సిల్, ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన ఫొటో కాంటెస్ట్‌లో వినుకొండకు చెందిన ఫొటోగ్రాఫర్లకు ట్రైబల్ ఫొటో ఆఫ్ ది ఇయర్ అవార్డు లభించింది. వినుకొండకు చెందిన వంగపల్లి బ్రహ్మయ్య తీసిన హ్యాపినెస్, కేసానుపల్లి సుబ్బారావు తీసిన వాటర్ క్యారీ ఫొటోలు అవార్డులకు ఎంపికైనట్లు వారు తెలిపారు. ఈ నెల 18న విజయవాడలో అవార్డులు అందుకోనున్నట్లు వివరించారు.



వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో మంగళవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్టం : రూ. **1,500** గరిష్టం : రూ. **2,300**

మోడల్ ధర రూ. **1,900**

మిర్చి

యార్డు సమాచారం
(మంగళవారం ధరలు)



వచ్చిన బస్తాలు	54,912
అమ్మకాలు	53,097
నిల్వ	8,514

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500-13,500
నంబరు-5	10,000-13,300
341	10,000-14,000

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500-12,800
నంబరు-5	10,000-13,400
341	10,000-14,800
4848	10,000-12,500

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 - 14,000
బాడిగ-355	10,000 - 12,600
దేవనూరు డీలక్స్	10,000 - 12,500
ఆర్మూర్	9,800 - 11,000
తాలుకాయలు	5,000 - 7,000

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000-13,800
బాడిగ - 355	10,000-12,200
దేవనూరు డీలక్స్	10,000 - 12,400
తాలు	5,300 - 7,000

-కొరిటెపాడు
(గుంటూరు)



పసుపు ధరలు

(మంగళవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 676

కొమ్ములు : 506 బస్తాలు

(ధర రూ॥ల్లో)

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,700	10,600	10,100

కాయలు : 170 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,800	10,600	10,200

మొత్తం అమ్మకాలు : 507.00 క్వింటాళ్లు

-దుగ్గిరాల

దక్షిణ మధ్య రైల్వే జీఎం తనిఖీలు

లక్ష్మీపురం: దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ మంగళవారం పగిడిపల్లి – గుంటూరు – కృష్ణా కెనాల్ – విజయవాడ సెక్షన్‌లో తనిఖీలు చేపట్టారు. గుంటూరు డివిజనల్ రైల్వే మేనేజర్ సుధేష్ణ సేన్, విజయవాడ డివిజనల్ రైల్వే మేనేజర్ మోహిత్ సోనాకియా ఆయా ప్రాంతాల్లో పాల్గొన్నారు. ముందుగా జీఎం ఈ సెక్షన్‌లో రియర్ విండో తనిఖీ నిర్వహించారు. సిగ్నలింగ్, రైల్వే ట్రాక్‌ల నిర్వహణ పరిశీలించారు. నల్గొండ రైల్వే స్టేషన్‌లో వెయిటింగ్ హాల్, దివ్యాంగుల టాయిలెట్లు, లిఫ్ట్, తాగు నీటి సౌకర్యం వంటి వాటిపై సమీక్షించారు. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా పునరాభివృద్ధి పనుల పురోగతిని తెలుసుకున్నారు. తర్వాత గుంటూరు పట్టాభిపురంలోని గుంటూరు రైల్వే డివిజనల్ కార్యాలయంలో డివిజనల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా గుంటూరులో మొక్కలు నాటే కార్యక్రమంలో అధికారులతో కలిసి పాల్గొన్నారు. తర్వాత మంగళగిరి రైల్వే స్టేషన్‌కు వెళ్లి పరిశీలించారు. భద్రతా మార్గదర్శకాలను పాటించాలని, పనులను గడువు నాటికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.



మంగళగిరి రైల్వే స్టేషన్‌లో పరిశీలిస్తున్న జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ్, డీఆర్ఎం సుధేష్ణ సేన్

ఆత్మహత్యాయత్నం చేసిన బాధితుడికి పరామర్శ

● ధైర్యం కోల్పోవద్దని, అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే శివకుమార్ భరోసా

తెనాలి: మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారి వేధింపులకు తాళలేక సెల్ఫీ వీడియో తీసుకుని ఆత్మహత్యాయత్నం చేసి, స్థానిక జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగి చొప్పర దిలీప్‌కుమార్‌ను మంగళవారం మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పరామర్శించారు. 'ఆప్కాస్'తో నియమితుడై మున్సిపాలిటీ హెడ్‌వాటర్ వర్క్సులో పనిచేస్తున్న దిలీప్ కుమార్ ది గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయిస్–వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) తెనాలి మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ కమిటీలో ప్రధాన కార్యదర్శి. విధులు సక్రమంగా నిర్వహిస్తున్నప్పటికీ మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని బాధితుడు తెలిపారు. విధుల నుంచి తొలగిస్తామని వేధిస్తున్నట్టు చెప్పారు.



దిలీప్‌కుమార్‌ను పరామర్శిస్తున్న శివకుమార్

వివరాలు తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే శివకుమార్ ధైర్యం చెప్పారు. అన్నివిధాలా అండగా ఉంటానని పేర్కొన్నారు. త్వరగా కోలుకోవాలన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు. ఆయన వెంట వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, దళిత నేతలు కొమ్ము రాయల్, మేకల సాగర్, అత్తోట అమృత రాజు, కౌన్సిలర్లు షేక్ దుబాయ్‌బాబు, యాతాటి అనిల్, ట్రేడ్ యూనియన్ నాయకులు దేవరపల్లి చంద్రశేఖరరెడ్డి, అక్కిదాసు కిరణ్‌కుమార్, కనపర్తి శశి పాల్గొన్నారు.

సెప్టెంబర్ 13న జాతీయ లోక్ అదాలత్

తెనాలి రూరల్: జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలతో సెప్టెంబర్ 13వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నారు. ఈ మేరకు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి డి.శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని రకాల సివిల్, భరణం, బ్యాంకు దావాలు, మోటారు వాహనాల ప్రమాదాల కేసులు, రాజీ పడదగిన క్రిమినల్ కేసులను ఈ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

అణు విధ్వంసంపై స్లయిడ్ షోలు

నేడు తెనాలి, చిలుమూరులో ఏర్పాటు

తెనాలి: హిరోషిమా–నాగసాకి దినోత్సవాల సందర్భంగా కోల్‌కతాకు చెందిన ముందడుగు సంస్థ జనసాహితి సహకారంతో స్లయిడ్ షో ఏర్పాటు చేసింది. హిరోషిమా–నాగసాకి పట్టణాల్లో అణువిధ్వంసం జరిగి సరిగ్గా 80 ఏళ్లయిన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా సోమవారం విశాఖపట్నంలో తొలి స్లయిడ్ షో నిర్వహించారు. బుధవారం తెనాలి బుర్రిపాలెం రోడ్డులోని వివేక సెంట్రల్ స్కూల్‌లో ఉదయం 10.30 గంటలకు, మధ్యాహ్నం 2 గంటలకు చిలుమూరులోని శ్రీరామా రూరల్ కాలేజీలో స్లయిడ్ షోలను నిర్వహిస్తారు. జనసాహితి బాధ్యులు కొత్తపల్లి రవిబాబు ఈ మేరకు తెలిపారు.

నిర్వీర్యమవుతున్న విద్యాహక్కు చట్టం

దుగ్గిరాల: ప్రభుత్వం ఇంగ్లిష్ మీడియం పాఠశాలలు ఏర్పాటు చేసి, విద్యా హక్కు చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని ఏపీ ఎమ్మార్పీఎస్ స్టేట్ లీగల్ సెల్ కన్వీనర్ చిలువూరు నాగరాజు మాదిగ డిమాండ్ చేశారు. దుగ్గిరాల మండలం చిలువూరు గ్రామంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... రాష్ట్రంలో విద్యా హక్కు చట్టం పూర్తిగా నిర్వీర్యం అయిపోయిందని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు అన్యాయం జరుగుతోందని మండిపడ్డారు. ప్రతి గ్రామంలో నిబంధనల మేరకు ప్రభుత్వం పేద సామాజిక వర్గాలకు విద్యను అందుబాటులో ఉంచాలన్నారు.

ఇన్‌స్పైర్ రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయాలి

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల్లో వైజ్ఞానిక ఆలోచనలు రేకెత్తించేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఇన్‌స్పైర్ మానక్ విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనకు విద్యార్థులతో పెద్ద సంఖ్యలో రిజిస్ట్రేషన్ చేయించాలని గుంటూరు జిల్లా ఉపవిద్యాశాఖాధికారి జి.ఏసురత్నం పేర్కొన్నారు. మంగళవారం పాత బస్టాండ్ సెంటర్‌లోని జిల్లా పరీక్షా భవన్‌లో ఇన్‌స్పైర్ మానక్‌పై డివిజన్ పరిధిలోని సైన్సు ఉపాధ్యాయులకు ఓరియెంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సైన్సు అధికారి షేక్ గౌసుల్‌మీరా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఏసురత్నం మాట్లాడుతూ భావి శాస్త్రవేత్తల రూపకల్పనకు నాందిగా ప్రతిభావంతులుగా తీర్చిదిద్దవచ్చునని అన్నారు. ప్రాథమికోన్నత బడుల నుంచి మూడు, ఉన్నత పాఠశాలల నుంచి ఐదు, హైస్కూల్ ప్లస్ నుంచి ఏడు చొప్పున నామినేషన్లు పంపాలని స్పష్టం చేశారు. పోస్టర్‌ను ఆవిష్కరించారు. జిల్లా సైన్సు అధికారి షేక్ గౌసుల్‌మీరా, రీసోర్సు పర్సన్లు డి. శివ శంకరరావు, డీవీ రమణ, పి. మల్లికార్జునరావు, ఎం.అప్పారావు, గంగాధర్ పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఏసురత్నం, గౌసుల్‌మీరా, రీసోర్సు పర్సన్లు

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

గుంటూరు రూరల్: హాస్టల్‌లో ఉండలేక ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం చేబ్రోలు మండలం శేకూరు గ్రామానికి చెందిన విద్యార్థిని పెదపలకలూరు రోడ్డులోని ఒక కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. రెండు నెలలుగా హాస్టల్‌లో ఉండలేనని, ఇంటికి తీసుకెళ్లాలని తల్లిదండ్రులకు చెబుతోంది. వారు ఆమెకు నచ్చజెప్పి హాస్టల్‌లోనే ఉంచుతున్నారు. మనస్తాపానికి గురైన విద్యార్థిని మంగళవారం హాస్టల్‌లో భవనంపైకి ఎక్కి కిందికి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. తల్లిదండ్రులకు కళాశాల యాజమాన్యం సమాచారం అందించారు. విద్యార్థిని తల్లిదండ్రులు గోపయ్య, శాంతకుమారిల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానం

మంత్రి గుమ్మడి సంధ్యారాణి

గుంటూరు వెస్ట్: తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని, దీని ప్రాధాన్యతను తెలియజేసే లక్ష్యంతో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నామని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ సెక్రటరీ సూర్య కుమారిలతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన బిడ్డలను కోరుకునే తల్లులు, వారికి పాలు ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలింతలకు, పిల్లలకు రూ. కోట్లు ఖర్చు చేసి బాల సంజీవని అందిస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,065 తల్లులు పిల్లలకు పాలిచ్చే గదులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అనంతరం మంత్రి తల్లిపాల ఆవశ్యకతపై ప్రత్యేక పోస్టర్లు ఆవిష్కరించారు. మహిళలు ఏర్పాటు చేసిన స్టాల్స్ పరిశీలించారు. కార్యక్రమంలో డీఆర్వో షేక్ ఖాజావలి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్లు పి.ప్రవీణ, ఎం.శిరీష, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి ప్రసూన పాల్గొన్నారు.

వారోత్సవాల్లో పాల్గొనాలి

తెనాలి అర్బన్: తల్లిపాల వారోత్సవాల్లో అందరూ పాల్గొనాలని జిల్లా మలేరియా అధికారి మురళీకృష్ణ సుబ్బరాయణం పిలుపునిచ్చారు. ఆశా డే వేడుకలను పట్టణంలోని జిల్లా వైద్యశాల, సుల్తానాబాద్, చినపాడు, మారీసుపేటలలోని అర్బన్‌హెల్త్ సెంటర్‌లలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తల్లిపాల ఆవశ్యకతను వారోత్సవాల్లో తెలియజేయడం ప్రధాన లక్ష్యమన్నారు. పీపీ యూనిట్ వైద్యాధికారి డాక్టర్ యలవర్తి రాంబాబు మాట్లాడుతూ 12న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా 2–19 ఏళ్ల పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తామన్నారు. సమావేశంలో వైద్యాధికారి డాక్టర్ ఎస్. రమేష్, మలేరియా అధికారులు చిరసాని ప్రభాకర్ రెడ్డి, శ్రీకంఠ ఉమాకాంత్, అందె బాలచంద్రమౌళి, జి.రవికుమార్, తిరువీధుల శివరామప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి



మాట్లాడుతున్న మురళీకృష్ణ సుబ్బరాయణం

అక్రిడిటేషన్లు జర్నలిస్టుల ప్రాథమిక హక్కు



నిరసన వ్యక్తం చేస్తున్న జర్నలిస్టులు

గుంటూరు వెస్ట్: సమాజానికి ఫోర్త్ ఎస్టేట్‌గా సేవలందిస్తున్న జర్నలిస్టులు అక్రిడిటేషన్లు పొందడం ప్రాథమిక హక్కని ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ఎన్ మీరా, కె.రాంబాబు తెలిపారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాగానే అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు, ఇంటి స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఏడాదిన్నర దాటుతున్నా నూతన అక్రిడిటేషన్లుగాని, బదిలీ ప్రక్రియగానీ చేపట్టలేదన్నారు. మూడు నెలలకొకసారి పొడిగించుకుంటూ పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల జర్నలిస్టులు కనీసం బస్‌పాస్ అవకాశం కూడా సరిగ్గా పొందలేకపోతున్నారని పేర్కొన్నారు. ఇతర ప్రాంతాల నుంచి బదిలీ అవుతున్న సీనియర్ జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డులు కూడా బదిలీ చేయడం లేదని పేర్కొన్నారు. జర్నలిస్టులకు ఇంటి స్థలాలు ఇస్తామని మేనిఫెస్టోలో పెట్టారని గుర్తుచేశారు. దీనిని ప్రభుత్వం అమలు చేయాలన్నారు. రద్దు చేసిన యాక్సిడెంటల్ పాలసీలను కూడా పునరుద్ధరించాలన్నారు. తమిళనాడు, బిహార్ రాష్ట్రాల తరహాలో సీనియర్ జర్నలిస్టులకు పింఛన్ సౌకర్యం కల్పించాలని పేర్కొన్నారు. సమస్యల పరిష్కారానికి అధికారులు మూడు నెలలకొకసారి మీటింగ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు భక్త వత్సలరావు, కందా ఫణీంద్ర, కిరణ్, సువర్ణ కుమార్, శ్రీనివాస్, గిరి, కరీం బాషా, తిరుపతి రెడ్డి, ఆసిఫ్ ఖాన్, సుభాని, కార్తీక్ పాల్గొన్నారు.

ఘర్ ఘర్ తిరంగాలో పాల్గొనండి

గుంటూరు మెడికల్: బీజేపీ గుంటూరు జిల్లా విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం మంగళవారం నగరంలోని శ్రీకన్వెన్షన్‌లో జరిగింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్.మాధవ్ మాట్లాడుతూ అమృత మహోత్సవ్ పేరుతో జాతీయ జెండా పట్టుకొని 13, 14, 15వ తేదీలలో ఘర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో పాల్గొనాలని ప్రజలకు పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతి రావు, రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయ ప్రకాష్ నారాయణలు మాట్లాడుతూ జిల్లా పార్టీలో సీనియర్ నేతలు, కార్యకర్తలు నేటికీ పార్టీని నడిపిస్తున్నారని చెప్పారు. పి.వి.ఎన్.మాధవ్ గుంటూరు పర్యటన సందర్భంగా మంగళవారం పార్టీ శ్రేణులు భారీగా తరలివచ్చి ఘన స్వాగతం పలికాయి. పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆధ్వర్యంలో చిల్లీస్ దాబా నుంచి శ్రీ కన్వెన్షన్ హాల్ వరకు ర్యాలీగా వచ్చి స్వాగతించారు. తీన్మార్ డప్పులు, గిరిజన సంప్రదాయ నత్యాలు, పార్టీ జెండాలతో సందడి చేశారు. ద్విచక్ర వాహనాల ర్యాలీ ఆకట్టుకుంది. జిల్లా నలుమూలల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

అభివృద్ధికి సహకారం

మంగళవారం గుంటూరు నగరంలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మీడియా సమావేశంలో మాట్లాడారు. గతంలోనే గుంటూరులో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ కోసం రూ.100 కోట్ల యూజీడీ నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. అమరావతి ఆయువుపట్టు అయిన ఓఆర్ఆర్ నిర్మాణంపై ప్రత్యేక దృష్టి పెట్టి రూ.10 వేల కోట్లు విడుదల చేసినట్లు ఆయన వెల్లడించారు.

డ్రగ్స్ నివారణే 'ఈగల్' ధ్యేయం


తెనాలి రూరల్: ఏపీని డ్రగ్స్ రహిత రాష్ట్రంగా చేయడమే ఈగల్ (ఎలైట్ యాంటీ నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్) ముందున్న లక్ష్యమని ఈగల్ ఎస్పీ కె. నగేష్‌బాబు తెలిపారు. ఆ దిశగా విద్యాసంస్థల్లో డ్రగ్స్ వద్దు బ్రో అనే కార్యక్రమంతో అవగాహన కల్పిస్తున్నామని వివరించారు. స్థానిక వీఎస్సార్ అండ్ ఎన్వీఆర్ కళాశాలలో ఈ మేరకు మంగళవారం నిర్వహించిన సదస్సులో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, ఈగల్ టీం ఎస్పీ నగేష్‌బాబు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ డి. షీలా అధ్యక్షత వహించారు. సదస్సులో ఎస్పీ నగేష్‌బాబు మాట్లాడుతూ అవగాహన సదస్సులకు స్పందన లభించిందన్నారు. డ్రగ్స్ నిర్మూలిస్తే సగం నేరాలు తగ్గిపోతాయన్నారు. డ్రగ్స్ రహిత ఆంధ్ర ప్రదేశ్‌కు ప్రతి విద్యార్థి సహకరించాలన్నారు. గంజాయిపై ఎలాంటి సమాచారం ఉన్నా 1972 నంబరుకు కాల్ చేసి తెలియజేయాల్సిందిగా కోరారు. డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలు జీవితాలను నాశనం చేస్తున్నాయని వాపోయారు. పిల్లలపై తల్లిదండ్రులు నిఘా ఉంచాలని సూచించారు. జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో గంజాయికి కేంద్రాలుగా ఉన్న 37 హాట్ స్పాట్లను గుర్తించామని తెలిపారు. వాటిలో తెనాలిలో ఏడు ఉన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డీఎస్పీ బి.జనార్దనరావు, కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ నన్నపనేని సుధాకర్, సీఈఓ నన్నపనేని భాస్కర్, డైరెక్టర్ భాగ్యలక్ష్మి, ఎన్వీఆర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్వీవీ అజయ్, ఎన్‌సీసీ ఆఫీసర్ కె అశోక్, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఈగల్ ఎస్పీ నగేష్‌బాబు

వృద్ధురాలు హత్య

లక్ష్మీపురం: వృద్ధురాలిని కొట్టడంతో కింద పడి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మంగళవారం గుజ్జనగుండ్లలో చోటు చేసుకుంది. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుజ్జనగుండ్ల ప్రాంతానికి చెందిన ఆకుల అంజమ్మ (70)కు కుమార్తె ఉప్పాల త్రివేణి ఉంది. త్రివేణికి తారకరామనగర్ ప్రాంతానికి చెందిన లక్ష్మి స్నేహితురాలు. ఇద్దరు కలిసి బంగారం తాకట్టు పెట్టిన వ్యవహారంలో మనస్పర్థలు వచ్చాయి. లక్ష్మీతో త్రివేణి భర్త దురుసుగా ప్రవర్తించాడు. ఆమెకు సర్దిచెప్పడానికి త్రివేణి గుజ్జనగుండ్లకు వెళ్లింది. ఆ సమయంలో లక్ష్మి బయటకు వెళ్లగా.. ఆమె తల్లి అంజమ్మ ఉంది. త్రివేణిని చూడగానే ఆమెను దుర్భాషలాడింది. కోపంలో త్రివేణి ఆమెను చెంపపై గట్టిగా కొట్టడంతో కింద పడి అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న లక్ష్మీ వెంటనే పట్టాభిపురం పోలీసులకు సమాచారం తెలిపింది. వెస్ట్ డీఎస్పీ కె.అరవింద్, సీఐ గంగా వెంకటేశ్వర్లు, ఎస్సై త్రివేణిలు వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. హత్య కేసు నమోదు చేసి, మృతదేహాన్ని జీజీహెచ్‌కు పోస్ట్ మార్టం నిమిత్తం తరలించారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ కె.అరవింద్

కలెక్టరేట్‌లో ఉద్యోగ సంఘ నేత జన్మదిన వేడుకలు

గుంటూరు వెస్ట్: నిబంధనలు పాటించాల్సిన ప్రభుత్వ ఉద్యోగులు వారు. కార్యాలయ ప్రాంగణాల్లో ప్రయివేటు కార్యక్రమాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత గల వారు. కానీ తమ నాయకుడి జన్మదిన వేడుకల సందర్భంగా నిబంధనలు గాలికి వదిలేశారు. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నేత జన్మదినాన్ని పురస్కరించుకుని మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో ఉద్యోగులు జన్మదిన శుభాకాంక్షలతో పెద్ద బ్యానర్లు కలెక్టర్ చాంబర్‌కు కూతవేటు దూరంలోనే కట్టించారు. కార్యక్రమానికి కనీసం జిల్లా రెవెన్యూ అధికారి అనుమతి కూడా తీసుకోకపోవడం గమనార్హం. కలెక్టరేట్‌లో వినతిపత్రం ఇవ్వాలన్నా సామాన్యులకైతే ఐదుగురికి మించి అనుమతివ్వరు. మరి ఉద్యోగ సంఘం నాయకులకు నిబంధనలు వర్తించవా? వారు అన్నిటికీ అతీతులా? అనే సందేహం కలగకమానదు. కనీసం కలెక్టరేట్ కాంపౌండ్‌లో ఇలా జన్మదిన వేడుకలు, బహిరంగ మీటింగ్‌లు పెట్టినప్పుడు అధికారులు కూడా స్పందించపోవడం విడ్డూరంగా ఉంది. ఇప్పటికే కలెక్టరేట్‌లో అత్యధిక భాగం ఉద్యోగ సంఘాల పేరుతో కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేశారు.



కలెక్టరేట్ ప్రాంగణంలో కార్యక్రమంలో పాల్గొన్న ఉద్యోగ సంఘాల నాయకులు

అనుమతి తీసుకోలేదు: డీఆర్వో షేక్ ఖాజావలి

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నేత జన్మదిన వేడుకలకు, బహిరంగ ప్రదేశంలో మీటింగ్‌కుగానీ ఉద్యోగ సంఘ నాయకులు ఎటువంటి అనుమతి తీసుకోలేదు. కలెక్టరేట్ ప్రాంగణంలో ఇష్టం వచ్చినట్లు కార్యక్రమాలు నిర్వహిస్తామంటే నిబంధనలు అనుమంతిచవు.

ఉరివేసుకుని వ్యక్తి బలవన్మరణం

సత్తెనపల్లి: ఉరివేసుకొని వ్యక్తి బలవన్మరణకు పాల్పడిన సంఘటన మంగళవారం వెలుగుచూసింది. వివరాలు ఇలా ఉన్నాయి.. సత్తెనపల్లి మండలం భీమవరం గ్రామానికి చెందిన పాలేటి మహేష్(29) ప్రైవేటు ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. సుమారు 13 ఏళ్ల క్రితం భీమవరం గ్రామానికి చెందిన దయామణితో వివాహం అయ్యింది. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. కాగా 8 ఏళ్ల క్రితం భీమవరం గ్రామానికి చెందిన స్నేహితుడి భార్య ప్రశాంతితో వివాహేతర సంబంధం పెట్టుకోగా రెండు కుటుంబాల మధ్య గొడవలు జరిగాయి. ఆక్రమంలో మనస్థాపానికి గురైన ఆమె భర్త రైలు కింద పడి మృతి చెందాడు. అయినప్పటికీ వారి మధ్య వివాహేతర సంబంధం కొనసాగుతూనే ఉంది. ఈ క్రమంలో పాలేటి మహేష్ సోమవారం రాత్రి 7 గంటల సమయంలో భీమవరం గ్రామానికి వెళ్లి వారి బంధువులతో కలిసి గుడిపూడి గ్రామంలో జరిగిన ఫంక్షన్‌లో పాల్గొని తిరిగి రాత్రి 10 గంటలకు సత్తెనపల్లి టౌన్‌కి చేరుకున్నాడు. ప్రశాంతి, మహేష్ కలిసి రెండు నెలల క్రితం కొత్తగా అద్దెకు తీసుకున్న రేకుల ఇంటిలో ఉంటున్నారు. ఆ ఇంట్లోని బెడ్‌రూమ్‌లో ప్రశాంతి, పిల్లలు పడుకోగా మృతుడు హాల్లో పండుకున్నాడు. మృతుడు బెడ్ రూమ్ తలుపు వేసి ఇంటికి బయట నుంచి తాళం పెట్టి చీరతో ఫ్యాన్‌కి ఉరివేసుకొని మరణానికి గల కారణాలను ఒక చిన్న పేపర్ మీద రాసి పెట్టాడు. ప్రశాంతి ఉదయాన్నే 6:30 గంటలకు లేచి బెడ్‌రూమ్ తలుపు తట్టగా ఎంతసేపటికీ భర్త తలుపు తీయకపోవడంతో కిటికీ వైపు నుంచి రోడ్డుపై వెళ్తున్న సాకే కోటేశ్వరరావును కేకలు వేసి పిలువగా చుట్టుపక్కల వారు వచ్చి తలుపులు తీశారు. ఇంటి కప్పు రేకులకు వేసిన రాడ్డుకు చీరతో ఉరి వేసుకున్నాడు. మృతుడి భార్య దయామణి ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించి అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

భార్యపై భర్త దాడి.. కేసు నమోదు

ముప్పాళ్ల: భార్యపై భర్త దాడి చేసి గాయపరిచిన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వి.సోమేశ్వరరావు మంగళవారం తెలిపారు. సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని రుద్రవరం గ్రామానికి చెందిన తలపాల పిచ్చయ్య, నాగరాణి దంపతులు మనస్పర్థలతో విడిపోయి వారి కుమారుల వద్ద ఉంటున్నారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి పిచ్చయ్య, తన చిన్న కుమారుడు తలపాల జగన్నాధం, అన్న తలపాల శ్రీను, అన్న కొడుకు తలపాల విష్ణులతో కలిసి భార్య నాగరాణి వద్దకు వచ్చి ఊరు విడిచి వెళ్లాలని, లేకుంటే చంపేస్తామంటూ బెదిరించారు. ఈ క్రమంలోనే పిచ్చయ్య కర్రతో నాగరాణి తలపై కొట్టడంతో తలకు తీవ్ర గాయమై స్పృహ కోల్పోయింది. గాయపడిన నాగరాణిని చికిత్స నిమిత్తం సత్తెనపల్లిలోని ఏరియా వైద్యశాలకు తరలించారు.